జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





శుక్రవారం, మే 8, 2026 పేజీలు :3

## వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన డిపిఓ






# ఎల్ఆర్ఎస్‌కు మరో అవకాశం..

## ఆరేళ్లుగా కొనసాగుతున్న ఎల్ఆర్ఎస్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూములను క్రమబద్ధీకరించేందుకు చేపట్టిన లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) ఫీజులో మరోసారి ప్రభుత్వం రాయితీ అవకాశం కల్పించింది. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులు లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం ఫీజు చెల్లింపులో 25 శాతం రైతు ప్రకటిస్తూ జీవో 131 జారీ చేసింది. జిల్లాలోని మధ్యతరగతి ప్లాట్ యజమానులకు భారీ ఊరట లభిస్తుందని భావిస్తున్నారు. జూలై 31వరకు రాయితీ గడువును వినియోగించుకొని ఫీజు చెల్లించి ప్రభుత్వం కల్పించిన గడువును సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలతోపాటు గ్రామపంచాయతీల పరిధిలో వచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం ఆరేళ్లుగా కసరత్తు చేస్తూనే

### సేంద్రీయ వ్యవసాయానికి
# ప్రాధాన్యత ఇవ్వాలి

- -ప్రభుత్వ పథకాల మీద అవగహన అవసరం
- -"సురక్షితమైన బాల్యం, సురజిక్షితమైన భవిష్యత్తు"
- -చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కె. లక్ష్మీపతి గౌడ్




నారాయణపేట ప్రతినిధి
మే 07 ప్రజా జ్యోతి
నారాయణపేట జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం లక్ష్మీపురం మరియు చిన్నజట్టం గ్రామలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది.



# అకాల వర్షం
## అన్నదాతకు నష్టం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం కురియడంతో పలు కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న వరి ధాన్యం తడిచిపోయింది. వరద నీటి ప్రవాహం వల్ల పలు కేంద్రాల్లో కుప్పల్లో నిల్వ ఉన్న ధాన్యం కొట్టుకుపోయింది. ఈదురు గాలులు, వర్షం వల్ల ధాన్యం కాపాడుకోవడానికి అన్నదాతలు అవస్థలు పడ్డారు. జిల్లాలోని పలు కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి ఉంచిన 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం, 2 వేల క్వింటాళ్ల మక్కలు తడిచి పోయాయి. కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం తడిచి రైతులు లబోదిబో మంటున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న మామిడి కాయలు రాలి నేలమట్టమయ్యాయి. జిల్లాలో సుమారు 200 ఎకరాల్లో మామిడి పంట నష్టానికి గురయినట్లు ప్రాథమిక అంచనా ఉంది.

# వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన డిపిఓ

మద్దూర్ మండల ప్రతినిధి ప్రజాజ్యోతి మే07:నారాయణపేట జిల్లా మద్దూర్ మండల పరిధిలోని ఖాజీపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ)పి.సుధాకర్ రెడ్డి,ఎంపీడీవో రామన్న, ఏపీఎం కృష్ణవేణి కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో రైతులకు అందుతున్న సౌకర్యాలు, వరి తూకం ప్రక్రియ,తేమ శాతం పరిశీలన, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను అధికారులు పరిశీలించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, చెల్లింపులు సమయానికి జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యం.సాయప్పపాల్గొని రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు గ్రామపంచాయతీ తరపున సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యండి.షాజిల్,గ్రామ వార్డు



మెంబర్లు,బి.శాంత్ కుమార్,విఓఎ లాలప్ప,రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సేంద్రీయ వ్యవసాయానికి

# ప్రాధాన్యత ఇవ్వాలి

ఇట్టి విజ్ఞాన సదస్సుకు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మీపతి గౌడ్ హాజరైన గ్రామస్తులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ "రైతు లేకపోతే దేశం లేదు" అంటారు. వ్యవసాయం అంటే కేవలం పంటలు పండించడం మాత్రమే కాదు, ఇది ఒక సంస్కృతి, జీవన విధానం. మనకు కావాల్సిన ఆహారాన్ని అందించేది వ్యవసాయమే. రైతులు తమ పంట పొలాల యొక్క భూసార పరీక్షలు చేయించుకొని, పంటల బీమా చేయించి, నష్టాలను అధిగమించవచ్చని తెలిపారు. నిత్యవసర సరుకుల చట్టం ద్వారా ప్రతి ఒక్క వ్యక్తి తమ యొక్క రసీదులను జాగ్రత్తపరచుకంటే నష్ట పరిహారం పొందే వెసలుబాటు ఉంటుందని చెప్పారు. బాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు, ఆడ పిల్లలకు చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయడం నేరమని తెలిపారు. పిల్లలకు చిన్నతనం నుండి మంచి రక్షణ మరియు విద్యావకాశాలు కల్పిస్తే, వారి భవిష్యత్తు (దేశ భవిష్యత్తు) సురక్షితంగా ఉంటుంది అని తెలిపారు.



జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ ద్వారా పేదవారు 15100 నెంబర్ కి కాల్ చేసి ఉచిత న్యాయాన్ని పొందవచ్చు అన్నారు. ఇట్టి కార్యక్రమానికి భానుచందర్ (లక్ష్మిపురం గ్రామా పంచాయతీ సెక్రటరీ) మమత ( గ్రామా సర్పంచ్), సుజాత (చిన్నజట్టం గ్రామా పంచాయత్ సెక్రటరీ), జ్యోతి (గ్రామా సర్పంచ్) మరియు శ్యామప్ప (కానిస్టేబుల్) మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పుల్గర్ చర్ల గ్రామంలో అక్రమ పెంటకుప్పల దందా

## రహదారులు, స్మశాన వాటికలు ఆక్రమణకు గురవుతున్నాయంటూ ఆగ్రహం.

## ఎమ్మార్వో,ఎంపీడీవోలకు వినతిపత్రం అందజేసిన గ్రామస్థులు.

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్. మండల పరిధిలోని పుల్గర్ చర్ల గ్రామంలో అక్రమంగా ఏర్పాటు చేస్తున్న పెంటకుప్పల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని ప్రధాన రహదారులు, కాలనీల మధ్య ప్రాంతాలు, స్మశాన వాటికలను సైతం కొందరు వ్యక్తులు పెంట నిల్వ కేంద్రాలుగా మార్చేస్తున్నారని ఆరోపిస్తూ గ్రామస్థులు బుధవారం ఎమ్మార్వో, ఎంపీడీవోలకు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఆర్టీఐ మండల అధ్యక్షుడు మల్లెపూల గోపాలకృష్ణ, 9వ వార్డు కలమూరు మల్లేష్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన రహదారులపై పెద్దఎత్తున పెంట నిల్వ చేయడం వల్ల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. స్మశాన వాటికలను కూడా వదలకుండా ఆక్రమించి పెంటకుప్పలు ఏర్పాటు చేయడం దారుణమన్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా పెంటకుప్పలే దర్శనమిస్తుండటంతో దుర్వాసనలు వ్యాపిస్తున్నాయని, ఈగలు, దోమలు అధికమై ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంటకుప్పల కారణంగా గ్రామంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం నెలకొన్నదని, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అక్రమంగా రహదారులు, స్మశాన వాటికలను ఆక్రమించి పెంట నిల్వ చేస్తున్న వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరారు. గ్రామ ప్రజల సమస్యను అత్యవసరంగా పరిగణించి తక్షణమే చర్యలు తీసుకుని గ్రామానికి న్యాయం చేయాలని ఉన్నతాధికారులను వేడుకున్నారు.



# ఎల్ఆర్ఎస్‌కు మరో అవకాశం




గత సంవత్సరం మార్చి 31వ తేదీ వరకు ఎల్ఆర్ఎస్ ఫీజులో 25 రాయితీ ఇచ్చింది. ఆ గడువు ముగిసిన తర్వాత మరో నెలరోజులపాటు పొడిగించారు. జిల్లాలో కొంతమంది దరఖాస్తులు ముందుకు వచ్చినా చిన్నచిన్న లోపాలతో దరఖాస్తులు పెండింగ్‌లో చూపడంతో నిరాశపడ్డారు. ప్రస్తుతం ప్రభుత్వం మరోసారి 25 రాయితీతో అవకాశం కల్పించడం ద్వారా షార్ట్‌ఫాల్‌ను సరిచేసుకొని క్రమబద్ధీకరించుకోవాలని సూచిస్తున్నారు.

ఆరేళ్లుగా కొనసాగుతున్న ఎల్ఆర్ఎస్

అనుమతి లేని ప్లాట్లు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్‌లో 25 శాతం రాయితీ నిర్ణయంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ పూర్తవుతుందని ప్రభుత్వం భావించినా అనుకున్న దరఖాస్తుదారులు నామమాత్రంగానే ముందుకు వస్తున్నారు. జిల్లాలో ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి 25శాతం రాయితీ ప్రకటించినా దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవడానికి ముందుకు రాకపోవడంతో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలో భూముల ధరలు ఆశాజనకంగా లేకపోవడం, అమ్మకాలు లేకపోవడం, భూసంబంధ వివాదాలు, కేసులపై ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత లేకపోవడం వంటి కారణాలతోనే దరఖాస్తుదారులు ముందుకు రావడం లేదని భావిస్తున్నారు. ఈక్రమంలోనే అవగాహన కార్యక్రమాల ద్వారా దరఖాస్తుదారులను ప్రోత్సహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించడానికి ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసినా యూజర్ మాన్యువల్ ఫీ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్‌కు సంబంధించి సాంకేతిక సమస్యలు, సర్వర్‌లు బిజీగా ఉండడం, ఆన్‌లైన్ ప్రక్రియ ముందుకు సాగకపోవడం, దరఖాస్తుదారులకు నేరుగా ఆటోజనరేట్ మేసేజ్‌లు వెళ్లకపోవడం, సర్వర్‌లు మోరాయించడం వంటి ఇబ్బందులను దరఖాస్తుదారులు ఎదుర్కొన్నారు. ఈసారి అలాంటి సమస్యలు రాకుండా దృష్టి పెట్టారు. 2020 సెప్టెంబరులో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మున్సిపల్, పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రజలపై మోయలేని భారం మోపిందనే అభిప్రాయంతో ఎవరూ దరఖాస్తులు చేసుకున్నా ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. మున్సిపాలిటీలు గ్రామపంచాయతీల్లో అక్రమ లే అవుట్‌లు, రిజిస్ట్రేషన్లు లేని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు సెప్టెంబరు 1,2020న బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. 26 ఆగస్టు 2020లోపు సేల్‌డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసిన లేఅవుట్‌ల యజమానులు, ప్లాట్ ఓనర్లకు ఎల్ఆర్ఎస్‌కు అవకాశం కల్పించింది. కానీ ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ఎప్పుడో 20 ఏళ్ల క్రితం ఇళ్లు నిర్మించుకొని ఇంటి పన్నులు చెల్లించి క్రయవిక్రయాలు జరిపిన వారు కూడా ఎల్ఆర్ఎస్ చెల్లించే పరిస్థితి నెలకొంది. లేనిపక్షంలో క్రయవిక్రయాలు జరిపే అవకాశం లేని పరిస్థితి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయడానికి నిర్ణయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌పై ప్రకటనలు చేసి సర్వేలు చేయడానికి జిల్లాకు ఒక ప్రత్యేక బృందాన్ని నియమించారు. గత సంవత్సరం జూలై నెలలో మున్సిపాలిటీ, రెవెన్యూ, నీటి పారుదల శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన అధికారులతో ప్రత్యేక బృందాలను దరఖాస్తుల పరిశీలనకు ఏర్పాటు చేసింది. వాటిని పరిశీలించి పరిష్కరించే దిశగా దిశానిర్దేశం చేసినా ఆశించిన మేరకు స్పందన రాలేదు. ఇతర సర్వేలతో దరఖాస్తుల పరిశీలన పూర్తి కాలేదని తెలుస్తోంది.



# కొండా సురేఖ చేసిన జై శ్రీరామ్ వ్యాఖ్యల పై ఆగ్రహించిన బిజెపి

### బేషరతుగా హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలి.

### రాష్ట్ర బిజెపి నాయకులు కురువ చిన్న మల్లయ్య

చిన్నంబావి ఏప్రిల్ 7 (ప్రజాజ్యోతి)
రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జై శ్రీరామ్ అంటే పైసలు రాలతాయా.? అంటూ చేసిన వ్యాఖ్యలు కోట్లాది హిందువుల విశ్వాసాలను కించపరిచేలా ఉన్నాయని బీజేపీ రాష్ట్ర నాయకులు చిన్న మల్లయ్య పత్రిక ప్రకటన ద్వారా తీవ్రంగా ఖండించారు. జై శ్రీరామ్ అనేది కేవలం నినాదం కాదని, భారతీయ సంస్కృతి,సనాతన ధర్మం, దేశభక్తికి ప్రతీక అని పేర్కొన్నారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉంటూ శ్రీరాముని నామాన్ని అవమానించేలా మాట్లాడడం ఆమె అహంకారానికి నిదర్శనమని విమర్శించారు.తెలంగాణ అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జాతీయ రహదారులు, గిరిజన సంక్షేమ పథకాలు, ఆయుష్మాన్ భారత్, జల్ జీవన్ మిషన్, రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధరణ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తుంటే, వాటిని గుర్తించకుండా హిందూ విశ్వాసాలపై వ్యంగ్య వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ పార్టీ అసలు మనస్తత్వాన్ని బయట పెడుతోందన్నారు. పదే పదే పార్టీలు మారుతూ రాజకీయ లాభాల కోసం మాట్లాడే నేతలు ప్రజల ఆధ్యాత్మిక భావోద్వేగాలతో ఆటలాడటం మానుకోవాలని హెచ్చరించారు. హిందూ దేవతలు, నినాదాలపై వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ నాయకులకు అలవాటైందని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు. కొండా సురేఖ వెంటనే హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అలాగే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆమెను వెంటనే దేవాదాయ శాఖ మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.



# జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తి వేయాలి -వీరహాత్ ఆలీ

### ప్రజాప్రతినిధులు స్పందించకుంటే వారి ప్రమేయం ఉన్నట్టే :

### అక్రిడేషన్లు మరియు త్వరలో జర్నలిస్ట్ ల ఇండ్ల స్థలాల ప్రక్రియ

**మహబూబ్ నగర్ మే 7 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ ప్రతినిధులపై రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా పోలీసులు అక్రమంగా నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ డిమాండ్ చేశారు. గురువారం మహబూబ్ నగర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేవలం సోషల్ మీడియా పోస్టులను సాకుగా చూపి జర్నలిస్టుల గొంతు నొక్కే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. రాజకీయ నాయకులు, జర్నలిస్టుల మధ్య ఉండాల్సిన ఆరోగ్యకరమైన సంబంధాలను ఇలాంటి కేసులు దెబ్బతీస్తాయని, జర్నలిస్టుల స్వేచ్ఛకు భంగం కలిగిస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కేసులను వచ్చే నాలుగు రోజుల్లోగా ప్రభుత్వం మరియు పోలీస్ యంత్రాంగం ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి పిలుపునిస్తామని విరాహత్ అలీ అల్టిమేటం జారీ చేశారు. ఈ అంశాన్ని రాష్ట్ర డీజీపీ, ముఖ్యమంత్రి మరియు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లి పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామన్నారు.మహబూబ్ నగర్ జిల్లా ప్రజాప్రతినిధు ఈ అక్రమ కేసుల వ్యవహారం పట్ల స్పందించాలని లేని పక్షంలో ప్రజాప్రతినిధుల ఇన్వాల్ మెంట్ ఉంది అని భావించాల్సి వస్తుందని అని అన్నారు. జిల్లా ఎస్పీ తక్షణమే




స్పందించి అక్రమ కేసులను రద్దు చేయాలని, లేకపోతే యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందించే ప్రక్రియ యుద్ధప్రాతిపదికన కొనసాగుతోందని, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందించామని ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో జర్నలిస్టులపై దాడులు, వేధింపులు జరిగితే యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి,కల్కూరి రాములు,హైమద్ పాష జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు కాటం నాగరాజు గౌడ్,సతీష్ రేడ్డి, తదితరులు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# పెద్దమారూర్‌లో రైతులకు సోలార్, విద్యుత్ భద్రత అవగాహన.



**చిన్నంబావి మే 7 (ప్రజాజ్యోతి)**
చిన్నంబావి మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామంలో '99 ప్రజాపాలన ప్రగతిప్రణాళికలో భాగంగా రైతు వేదికలో గురువారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సోలార్, విద్యుత్ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఏఈ అప్పలనాయుడు సిబ్బందితో కలిసి రైతులతో సమావేశమై విద్యుత్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ లైన్ల నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతినెలా లైన్ పెట్రోలింగ్ నిర్వహించి లోపాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఫీల్డ్‌లో పనిచేసే సిబ్బంది తప్పనిసరిగా ఎర్త్‌రాడ్ వినియోగించడంతో పాటు హెల్మెట్, షూ ధరించి భద్రతా నిబంధనలు పాటించాలని తెలిపారు.రైతులు సొంతంగా ఫ్యూజ్ వైర్లు మార్చవద్దని సూచించారు విద్యుత్ స్తంభాలు సైతం ఎక్కువ వద్దని.. రైతులకు సూచించారు ఈ కార్యక్రమంలో లైన్మెన్ పద్మ గౌడ్ ఈశ్వరయ్య గ్రామ రైతులు అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో పీఎం కుసుమ్‌పై అవగాహన కార్యక్రమం


**గండీడ్, మే 7 (ప్రజా జ్యోతి):**
ప్రజా పాలన -- ప్రజా ప్రగతి ప్రణాళిక 90 రోజుల కార్యక్రమంలో భాగంగా గండీడ్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ మరియు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో "పీఎం కుసుమ్ -- సౌర విద్యుత్ కేంద్రాలు" అనే అంశంపై మండల స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు రైతులకు సౌర విద్యుత్ సబ్సిడీలు, వాటి ఉపయోగాలు, వ్యవసాయంలో సోలార్ విద్యుత్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు, విద్యుత్ ఖర్చుల తగ్గింపు, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాల గురించి వివరించారు. రైతులు సౌర విద్యుత్ వినియోగంతో దీర్ఘకాలికంగా లాభపడతారని తెలిపారు.కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ ఏఈ శ్రీకాంత్, వ్యవసాయ శాఖ ఏవో రాధమ్మ, సోలార్ ప్రతినిధులు, లైన్‌మెన్లు, వెటర్నరీ డాక్టర్ నరేందర్ యాదవ్ పాల్గొని రైతులకు పీఎం కుసుమ్ పథకం విశేషాలను వివరించారు.అలాగే సర్పంచ్ సంఘం అధ్యక్షుడు భగవంతు రెడ్డి, పెద్దవార్వల్ సర్పంచ్ జంగం వీరన్న, లక్ష్మీబాయి, సుజాత, కిషన్ నాయక్ తదితర సర్పంచులు, ఎలక్ట్రిసిటీ శాఖ మరియు సోలార్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో హాజరై ఆసక్తిగా పాల్గొన్నారు.



# మోదీ సభకు వేలాదిగా బయలుదేరుదాం

### బీజేపీ చిన్నంబావి మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య

**చిన్నంబావి, మే 7 (ప్రజాజ్యోతి)**
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మే 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం చిన్నంబావి మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బొగ్గు కురుమయ్య మాట్లాడుతూ.. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా తెలంగాణకు వస్తున్న ప్రధాని మోదీ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన సుమారు రూ.8000 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. దేశ అభివృద్ధితో పాటు తెలంగాణ పురోగతిని లక్ష్యంగా పెట్టుకుని నిర్వహిస్తున్న "వికసిత్ భారత్ -- వికసిత్ తెలంగాణ" సభకు చిన్నంబావి మండలంతో పాటు కొల్లాపూర్ నియోజకవర్గం నలుమూలల నుంచి ప్రజలు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు.ప్రధాని మోదీ సభ తెలంగాణ రాజకీయాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసే వేదికగా ఈ సభ నిలవనుందని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి సభను విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగ్గారి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ నాయకులు ధారా సింగ్, మండల ప్రధాన కార్యదర్శి సంపత్, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి చెన్నయ్య యాదవ్, గణేష్ రెడ్డి,గోపీనాయుడు, డి. వెంకటన్న, మద్దిలేటి,సుధాకర్, గూడెం శివ, గోపాల్,లింగస్వామి, శేఖర్ తదితర నాయకులు పాల్గొన్నారు.



# పెద్దవార్వల్ గ్రామంలో విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి : సర్పంచ్ జంగం వీరన్న

**మే 7 (ప్రజా జ్యోతి)**
గండీడ్ మండలంలోని పెద్దవార్వల్ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ జంగం వీరన్న విద్యుత్ శాఖ ఏఈ గారిని గ్రామపంచాయతీ తీర్మానం ద్వారా కోరారు.
గ్రామానికి త్రాగునీరు సరఫరా చేసే బోర్ వద్ద తక్కువ వోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉండటంతో నీటి సరఫరా అంతరాయం కలుగుతోందని ఆయన తెలిపారు. గ్రామ ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కారానికి వెంటనే ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.
అదేవిధంగా గ్రామంలో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో ప్రజలు చాలా దూరం నుండి తమ ఇళ్లకు వైర్లు తీసుకుని ప్రమాదకర పరిస్థితుల్లో విద్యుత్ వినియోగిస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.
గ్రామంలోని ఇంకా విద్యుత్ సౌకర్యం అందని ఇళ్లకు కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి సరైన విద్యుత్ సరఫరా కల్పించాలని గ్రామపంచాయతీ తరఫున ఏఈ గారికి వినతి పత్రం అందజేశారు. గ్రామ ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సర్పంచ్ జంగం వీరన్న కోరారు.

